ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక చింతన ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు హరిచారి, సాయిరాంచారి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేషన్, లక్ష్మీపతి, ముక్కా శ్రీనివాస్, అంబులెన్స్ సురేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

రసూల్‌పురా: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా ఎన్నికల్లో పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి కుమారుడు రినేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్ఖానాలో మూడోవార్డు పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన రినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీ గణేష్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, కంటోన్మెంట్ అభ్యర్థికి మరో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీపీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, ముంతాజ్ అలీ, అష్రఫ్, శ్రీను, అన్నానగర్ మురళి, రమేష్‌కుమార్ తదితరులున్నారు.

కంటోన్మెంట్ కాంగ్రెస్ కో- ఆర్డినేషన్ కమిటీ

రసూల్‌పురా: మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించేందుకు కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు సభ్యులుగా కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటైంది. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ జీవి. వెన్నెల గద్దర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఆమెతో పాటు మర్రి అమరేందర్‌రెడ్డి, శ్రీ గణేష్, వి. జయప్రకాష్, జమీల్, వెంకటేష్. కొత్త సంజీవరెడ్డి, అడ్డగుట్ట యాదగిరి, అయూబ్‌ఖాన్, బాబురావుముదిరాజ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. కాగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఎన్నికల్లో గెలుపు కోసం నాలుగు విభాగాల్లో కమిటీల నియామకం చేపట్టాలని సీఎం సూచించిన విషయం తెలిసిందే. నియోజకవర్గ కో-ఆర్డినేటింగ్ కమిటీలు, నియోజకవర్గ మహిళా కో- ఆర్డినేటింగ్ కమిటీ, వార్డుల వారీగా కో-ఆర్డినేటింగ్ కమిటీలు, ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్వరలో మిగిలిన కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని ఆమె పేర్కొన్నారు.

'పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నాం'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడానికి తమవంతుగా కృషి చేస్తున్నామని మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ కరెస్పాండెంట్ మహేష్ అన్నారు. అటువంటి గొప్ప లక్ష్యంతో మా విద్యా సంస్థలను స్థాపించామని తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం కరస్పాండెంట్ మహేష్ మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఫీజుతో మంచి విద్యను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సౌమ్య, ఉపాధ్యాయులు రాణి, వరలక్ష్మి, అమీర్, రాజేశ్వరి, సుప్రియ, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళల హక్కుల కోసం పోరాడిన వీరవనిత మోటూరు ఉదయం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు మోటూరు ఉదయం అని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో మోటూరు ఉదయం 22వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా హిట్లర్‌కు వ్యతిరేకంగా బుర్రకథ బృందాన్ని తయారు చేసి తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారని గుర్తు చేశారు. 26 సంవత్సరాల పాటు మహిళా హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కె.ఎస్.ఆశలత, బి.అనురాధా, సత్తమ్మ, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపుకోసం కృషిచేయాలి'

కవాడిగూడ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం ప్రతీ ఎస్సీ మోర్చా నాయకులు కార్యక్తలు పాటుపడాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం. రమేష్‌రాం పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్లబస్తీలో ఉన్న స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీ నివాసంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరుశురాం, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగు కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ... గత పది సంవత్సరాల్లో దేశ ప్రధాని, బీజేపీ హయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ రాబోయేపార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గెలుపుకోసం పాటుపడాలని వారు పిలుపునిచ్చారు.

నిఘా నీడలో లష్కర్ !

ఎన్నికల నేపథ్యంలో అధికారుల విస్తృత తనిఖీలు

- ప్రధాన రహదారుల్లో పికెటింగ్‌లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు



సికింద్రాబాద్‌లో కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు

సికింద్రాబాద్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ నగరంలో పోలీసు తనిఖీలు ముమ్మరమయ్యాయి. కూడళ్లలో పికెటింగ్‌లు, రహదారుల్లో తనిఖీలు సామాన్య ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. అడుగడుగునా పోలీసుల తనిఖీలు దర్శనమిస్తున్నాయి. రంగంలోకి దిగిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఓ వైపు, ఇతరత్రా విభాగాల పోలీసు బృందాలు మరోవైపు జల్లెడ పడుతున్నాయి.

30 పికెటింగ్‌లు ఏర్పాటు...

- సికింద్రాబాద్ నగరానికి చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో 30 పికెటింగ్‌లను నగర పోలీసులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ నుంచి జిల్లాలు, జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి వేళ్లే అన్ని రకాల వాహనాలను నిశితంగా తనిఖీలు చేస్తున్నారు. నగదు, విలువైన వస్తువులు, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.
- ఇంటర్నల్ రహదారుల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నగరంలో తిరిగే ద్విచక్ర వాహనాలు, కార్లలో సోదాలు చేస్తున్నారు. పోలీసు అధికారి, ముగ్గురు సిబ్బందితో పాటు వీడియో, కెమెరామెన్‌లను సమన్వయం చేస్తూ.. ఒక్కో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీల సమయంలోనే మొత్తంగా వీడియో రికార్డింగ్ చేస్తున్నారు.

విస్తృతంగా నాకాబందీలు...

సికింద్రాబాద్ ప్రాంతంలోని పోలింగ్ స్టేషన్ల వారీగా సమీక్షలు, అధ్యయనాలు నిర్వహించిన పోలీసు అధికారులు 150 వరకు సమస్యాత్మక స్టేషన్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో పికెటింగ్‌లతో పాటు మఫ్టీ పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారాలు, నేరగాళ్ల సంచారాలను నియంత్రిస్తున్నారు. ఒక్కో పోలీస్ స్టేషన్‌లో ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని వందలాది మంది పోలీసులు నాకాబందీ పేరుతో మూకుమ్మడి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయాల్లో నాకబందీలు నిర్వహిస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఒకింత కలవర పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్న సామాన్యులు...

- కళాశాలల్లో ఫీజులు, శుభకార్యాలకు సంబంధించి ఆభరణాల కొనుగోలు, స్థిరాస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు చేయడం రాజకీయాలకు సంబంధంలేని వ్యక్తులకు ఇబ్బందికరంగా పరిణమించింది. కనీసం రూ. లక్ష వెంట తీసుకుని బయటకు వెళ్లాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. సామాన్యుల విషయంలో ఆచీతూచీ వ్యవహరించాలని పోలీసు అధికారులు సంకేతాలు ఇస్తున్నా.. కొందరు పోలీసు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.
- సికింద్రాబాద్ ప్రాంతంలో ముగ్గురు పోలీస్ నోడల్ అధికారులు, 9 మంది సహాయక నోడల్ అధికారుల నేతృత్వంలో 24 గంటలు కొనసాగుతున్న తనిఖీల ఫలితంగా సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎలాంటి ఇబ్బందులు ఉండవు



ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే సికింద్రాబాద్ ప్రాంతంలో నిఘా పెంచి, తనిఖీలు విస్తృతం చేశాం. పెద్ద మొత్తంలో డబ్బు, విలువైన వస్తువులు ఉన్న సందర్భాల్లో మాత్రమే పోలీసులు విచారిస్తారు. ఎన్నికలకు సంబంధం లేని వ్యక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెంట తీసుకెళ్లే వస్తువులు, డబ్బుకు సంబంధించిన ఆధారాలు వెంటే తెచ్చుకోవడం మంచిది. ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వ్యక్తులు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవు.

– ఏసీపీ జైపాల్‌రెడ్డి, సికింద్రాబాద్ నోడల్ అధికారి

వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఓయూ విద్యార్థి నేత

ఉస్మానియా యూనివర్సిటీ: వరంగల్ ఎస్సీ రిజర్వ్‌డ్ ఎంపీ టికెట్ కోసం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఓయూ విద్యార్థి తుంగ బాలు ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కావ్య కాంగ్రెస్‌లో చేరడంతో కొత్త వారికి చాన్స్ ఇవ్వాలని మాజీ సీఎం కేసీఆర్ యోచనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి కేసీఆర్, కేటీఆర్‌కు విధేయుడైన తుంగ బాలు ఎంపీ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

మురుగు.. పరుగు



శాంతినగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లో గత కొద్ది రోజుల నుంచి ఇళ్ల మధ్య మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతున్నా.. పట్టించుకునే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. మురుగు గల్లీ రోడ్డంతా పారుతుండటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈగలు, దోమల వ్యాప్తి, దుర్గంధంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కంటోన్మెంట్ గోస తీర్చింది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న డీబీ దేవేందర్, అయూబ్‌ఖాన్

కంటోన్మెంట్ : కాంగ్రెస్ హయాంలోనే కంటోన్మెంట్‌లోని కీలక సమస్యల పరిష్కరించడంతో పాటు అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీబీ దేవేందర్ అన్నారు. ఆదివారం పికెట్‌లోని తన కార్యాలయంలో పార్టీ నేత అయూబ్‌ఖాన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. శనివారం తాము సీఎంని కలిసి స్థానిక సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కంటోన్మెంట్‌కు రావాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు అందేలా చూడాలని కోరామన్నారు. రసూల్‌పురా పరిధిలోని బస్తీలకు చెందిన వేలాది మంది ప్రజలకు పట్టాలు లేవని, బదలాయింపు ద్వారా పట్టాలు ఇప్పించాలన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సమస్యను తీర్చిన ఘనత కాంగ్రెస్ పాలకులదేనన్నారు. దివంగత పీజేఆర్‌తో కలిసి తాము చేపట్టిన ఐక్య పోరాటాల వల్లే కంటోన్మెంట్‌కు కృష్ణా జలాలు దక్కాయన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు తాము కృషి చేస్తామని సీఎంకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..



మహేంద్ర హిల్స్ రవి కాలనీ సొసైటీ ప్రతినిధులతో శ్రీ గణేశ్

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీతోనే సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నేత ఎస్. శ్రీ గణేశ్ అన్నారు. ఆదివారం మహేంద్రహిల్స్ రవి కాలనీ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై చర్చించారు. కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో విలీనమైతే ఇక్కడ పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో పార్టీ నిర్దేశించిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, మంగమ్మ, నర్సింగరావు, చంద్రమోహన్, గోపాల్‌రెడ్డి, మాధవి తదతరులున్నారు.

బోయిన్‌పల్లిలో యువకులతో..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే యుతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించిందని శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో యువతతో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన వారి సమస్యలపై చర్చించారు. కంటోన్మెంట్ పరిధిలో యువతకు కావాల్సిన సదుపాయాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న యువతకు ఉచిత శిక్షణ, ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బద్దం బల్వంత్‌రెడ్డి, భానుమనోజ్, చందు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..



సమావేశంలో పాల్గొన్న రినేష్‌రెడ్డి తదితరులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంపై మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పట్నం రినేష్ రెడ్డి తెలిపారు. తిరుమలగిరిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సునీతా మహేందర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీటీసీ చైర్మన్, ప్రస్తుతం వికారాబాద్ చైర్మన్‌గా కొనసాగుతున్నారన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు, నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి పథకాలు పేదలకు అందుతాయని రామ్‌కుమార్ వివరించారు. మే 13 న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు రెండు ఓట్లు వేయాలని ఇద్దరు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, ఆవుల బాల్‌రాజ్ ఇతర నాయకులు మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన మహిళా దినోత్సవ వేడుకలు



రాంగోపాల్‌పేట్: వెస్ట్ మారేడుపల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘనంగా సత్కరించారు. నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మలాదేవి, అలీప్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్ హెడ్ డాక్టర్ కే.బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకాలజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, సైంటిస్ట్ శీల శ్రీసుధ, చార్టెడ్ అకౌంటెంట్ స్వప్న ప్రియ, యోగా ఎక్స్‌పర్ట్ ప్రసన్న, కూచిపూడి నృత్య కళాకారిణి మృణాలిని తదితరులను ఘనంగా సత్కరించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ వేధకుమారిలు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియ చేసేలా నెల రోజుల పాటు ప్రతిరోజూ ఒక ప్రముఖ మహిళల చేత విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్‌లు అందించినట్లు చెప్పారు. ముగింపు సందర్భంగా మహిళా దినోత్సవాన్ని గొప్ప వేడుకగా నిర్వహించడంతో పాటు ప్రముఖులను సత్కరించి విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

3 నుంచి ఓయూలో సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక పోటీల్లో క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిఏటా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అబోడ్ బయోటెక్ ప్రతినిధులు ఎం.శ్రీనాథ్, శాలిని ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థులకు ఇంటెన్‌షిప్, శిక్షణ, మౌలిక సదుపాయాల వినియోగం ఇతర అంశాలపై సహకారం కోసం సంతకాలు చేశారు.

విదేశీ విద్యార్థుల ప్రవేశాలు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశాల విద్యార్థుల ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారు. పూర్తి వివరాలకు Osmania.ac.inను చూడొచ్చు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) టమాటా రూ.15, నల్ల వంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 16, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5గా ఉన్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మేడిబావి బస్తీలలో ఇఫ్తార్ విందు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబావి బస్తీలో స్థానిక బస్తీ పెద్దలు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎస్.శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు కనకరాజు, గురుదీప్‌సింగ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదని టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేష్‌మాదిగ విమర్శించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, మచ్చలేని నాయకుడిగా ఎదిగిన కడియం శ్రీహరిని విమర్శించడాన్ని సహించబోమన్నారు. కడియం శ్రీహరి ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, భూకబ్జాలు చేయలేదని, ఎవరి ఆస్తులూ దోచుకోలేదని అన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్




ఎమ్మెల్యే తలసానితో దేవాలయ కమిటీ ప్రతినిధులు

పద్మారావునగర్ : సాయిబాబా దేవాలయం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగుతూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బోయిగూడ బ్రిడ్జి సమీపంలోని సుప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయం నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. కమిటీ ప్రతినిధులు తమ పనితీరుతో దేవాలయం పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని కోరారు. బాబా ఆలయానికి ఎంతో పేరుందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బి. మహేష్‌ను ఎమ్మెల్యే తలసాని సత్కరించి అభినందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కరుణాకర్, సాయిక్రిష్ణ, భగత్ శ్రీను, శంకర్, ఎస్. రాజేందర్, సురేష్, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



మాట్లాడుతున్న పాస్టర్ జాయ్,



చిలకలగూడ హోసన్న పెంతెకోస్తు చర్చిలో..

చిలకలగూడ : చిలకలగూడలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హోసన్న పెంతెకోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ జాయ్ తన సందేశాన్ని వినిపించారు. ప్రజల పాపాల నుంచి విముక్తి కల్పించేందుకు ఏసుక్రీస్తు శిలువ వేయబడ్డాడని, మూడో రోజున సమాధి నుంచి పునరుత్థానునిగా తిరిగొచ్చిన రోజును ఈస్టర్‌గా నిర్వహించుకుంటారని వివరించారు.



ఈస్టర్ వేడుకల్లో శ్రీగణేశ్

మానవాళికి ప్రేమతత్వం..

కంటోన్మెంట్: ఏసుక్రీస్తు తన జీవన విధానం ద్వారా మానవాళికి ప్రేమతత్వం గొప్పతనాన్ని వివరించాడని కాంగ్రెస్ నేత శ్రీగణేశ్ అన్నారు. బాపూజీనగర్ తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ మూర్తి, నాగేశ్వర్‌రావుల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీగణేశ్ పాస్టర్లతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. విశ్వాసకులపై ఆయన దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.



లాలాపేటలో ర్యాలీ..

ఉదయం 5 గంటల నుంచే..

లాలాపేట: ఈస్టర్ సండే వేడుకలను తార్నాక డివిజన్ వ్యాప్తంగా ఉన్న పలు చర్చిల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున 5 గంటల నుంచే చర్చిల వద్ద క్రైస్తవుల సందడి నెలకొంది. తార్నాక ఐనోస్ చర్చిలో సన్‌రైజ్ సర్వీసుల పేరుతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరణాన్ని జయించిన ఏసుక్రీస్తుకు జయం జయం అంటూ క్రైస్తవ గీతాలను ఆలపించారు. 2000 ఏళ్ల క్రితం సర్వమానవాళి పాప విమోచన కోసం శిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు మూడో రోజు పునరుత్థానమైన సందర్భాన్ని వివరిస్తూ పాస్టర్లు రెవరెండ్ ఆర్ విలియం కేరి సందేశాన్ని ప్రకటించారు.

- శాంతినగర్‌లోని బెత్లెహేమ్ ఎవాంజలికల బాపిస్టు చర్చి ఆధ్వర్యంలో లాలాపేటలో ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. రెవరెండ్ ఆచార్య ఆహరోన్ తీగుళ్ల, ఏలిషమ్మ తదితరులున్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



మహిళలకు కుట్టుమిషన్లను అందజేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లతో పాటు మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. సీఎస్‌ఆర్‌లో భాగంగా ' ఇన్ఫో సిస్టమ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో వీటిని అందించారు. జెక్‌కాలనీలోని ఎవీఎస్ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, డాక్టర్ వైవీ రాఘవయ్యలు హాజరై ల్యాప్‌టాప్‌లతో పాటు కుట్టుమిషన్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థికంగా వృద్ధి చెందవచ్చన్నారు. మహిళాభ్యున్నతితో సమాజ వికాసం జరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు తగిన తోడ్పాటును అందించాలన్నారు. సంపత్, రమాదేవి, శేషగిరిరావు, సురేష్, మాధవి, నవీన్, రమణి, రషీద్ తదితరులున్నారు.